ప్రజాశక్తి
ఆదివారం 24 మార్చి 2024



పన్నుల వసూలుకు ప్రత్యేక కౌంటర్లు

కమిషనర్ ఎంఎం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులు కోసం ఆదివారం, సోమవారం సెలవు దినాలు అయినా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నెల చివరి రోజులు కావడం,సర్వర్ సమస్యలు కారణంగా నెలాఖరు వరకు ఆగకుండా వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు. రాయితీని వినియోగించుకోవాలని సూచించారు.



రహదారి నిర్మాణం చేపట్టని సారిపల్లిలోని టిడ్కో కాలనీ

- తాళాలిచ్చి చేతులు దులుపుకున్న నాయకులు
- పూర్తికాని మౌలిక వసతులు
- పెచ్చు లూడుతున్న నిర్మాణాలు

టిడ్కో ఇళ్ల రాజకీయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'తాంబూళాలు ఇచ్చాం తన్నుకు చావండి' అన్న చందంగా ఉంది అధికార పార్టీ నాయకుల పరిస్థితి. ఎన్నికల వేళ ఓట్లు కోసం అనేక జిమ్మిక్కులు చేస్తున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయని ప్రభుత్వాలు.. తాజాగా ఓట్లు కోసం అధికార పార్టీ నాయకులు లబ్ధిదారులకు తాళాలు అందజేసి చేతులు దులుపుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇళ్ల తాళాలు పంపిణీ కార్యక్రమం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అధికార పార్టీ నాయకులు చేపట్టారు.

విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సారిపల్లి వద్ద 2650 ఇళ్లు, సోనీ నగర్‌లో 1120 టిడ్కో ఇళ్లు 2017లో మంజూరు చేసిన విషయం తెల్సిందే. నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వలేకపోయింది. అదే పరిస్థితి ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో కొనసాగించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా విద్యుత్తు, తాగునీరు, రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగకుండానే లబ్ధిదారులకు ఇటీవల తాళాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపి టిడ్కో) గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరు చేసింది. జి ప్లస్ త్రి గృహాలు నిర్మించిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది.చాలా కాలం క్రితం నిర్మించి లబ్ధిదారులకు అప్పగించకపోవడం, నిర్వహణ లేకపోవడంతో ఇళ్లు పాడువుతున్నాయి. కిటికీలు చెదలు పట్టి, తలుపు పగిలిపోయి, సన్‌షేడ్‌లు పెచ్చులూడి పోయి దర్శనమిస్తున్నాయి.

నత్తనడకన మౌలిక వసతుల పనులు

సారిపల్లి, సోనీనగర్ వద్ద ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నేటికీ గృహ నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఇంట్లో ఉండేందుకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. ఏదో ఒకలా మమ అనిపించి రంగులద్ది లబ్ధిదారులకు తాళాలు ఇచ్చి ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. రోడ్లు, యుజిడి, సీవేజి ట్రీట్మెంట్ ప్లాంట్లు, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైపులైన్లు, విద్యుద్దీపాలు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లకు సంబంధించి పనులను అసలు ప్రారంభించలేదు. యుజిడి మంచినీటి వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ పోల్స్, లైన్లు ఏర్పాటు జరగలేదు. కేవలం ఒక్క లైన్లు మాత్రమే విద్యుత్ స్తంభాలు వేసి లైన్లు ఇవ్వడం జరిగింది. నిర్మాణం జరిగిన ఇళ్లకు ఇంకా విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్రం ప్రభుత్వం రూ.1.50 లక్షల రాయితీ అందజేస్తోంది. ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఎ- కేటగిరీ (300 చదరపు అడుగులు), బి కేటగిరీ (364 చదరపు అడుగులు), సీ కేటగిరీ (430 చదరపు అడుగులు) విస్తీర్ణంలో నిర్మించారు. ఈ కేటగిరీలోని ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేస్తోంది. బి-కేటగిరీ గృహ నిర్మాణాలకు రూ.7.65 లక్షలు ఖర్చవుతోంది. లబ్ధిదారుల వాటాగా రూ.50 వేలు చెల్లించారు. సి- కేటగిరికి రూ.8.65 లక్షలు ఖర్చవుతోంది. లక్ష రూపాయలు లబ్ధిదారుని వాటాగా చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా ద్వారా రుణాలు సమకూర్చుకుని టిడ్కో సంస్థకు చెల్లించాల్సి ఉంది.



పూర్తికాని కిచెన్ ప్లాట్‌ఫాం పనులు

లబ్ధిదారుల్లో ఆందోళన

పట్టణాల్లో అద్దెల భారాన్ని తగ్గించుకునేందుకు అప్పులు చేసి వేలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించారు. ఐదేళ్లలో ఇప్పటికీ వారికి ఇళ్లు అందుబాటులోకి తీసుకొని రాలేదు. దీంతో ఇళ్ల అద్దెలతోపాటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికీపూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే విధంగా పనులు పూర్తి చేస్తారో అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు సహాయ కేంద్రాలు

- చిన్నపిల్లల కోసం క్రష్ ఏర్పాటు
- ప్రహరీ లేనిచోట్ల బారికేడ్ల నిర్మాణం
- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట రూరల్

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. చిన్నపిల్లల కోసం క్రష్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శృంగవరపుకోట మండలంలో శనివారం ఆమె పర్యటించారు. నియోజకవర్గం పరిధిలోని తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, సెక్టార్ అధికారులు, డిటిలు, పోలీసు అధికారులతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్లకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు పోలింగ్ కేంద్రాల వెలుపల 100 మీటర్ల దూరంలో ఒక ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇక్కడ బిఎల్‌ఒలు ఉండి ఓటర్లకు మిగిలిపోయిన ఓటరు స్లిప్పులను అందిస్తారని, అవసరమైన సహకారాన్ని అందజేస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వెలుపల మాత్రమే రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండేలా చూడాలన్నారు. ప్రహరీగోడ లేని పాఠశాలలవద్ద బారికేడ్లతో రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటేయడానికి వచ్చే బాలింతలు, చిన్నపిల్లల సౌకర్యం కోసం అంగన్‌వాడీ సిబ్బందితో క్రష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవిని దష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, వేచిఉండే చోట నీడ కోసం టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రతీ నియోజకవర్గంలో ఒక మోడల్ యూత్ పోలింగ్ కేంద్రం, ఒక మోడల్ మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులకు, వికలాంగులకు ఈ ఏడాది ఇంటినుంచే ఓటు చేసే అవకాశాన్ని కల్పించారని చెప్పారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన బూత్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి, కళాజాతాలను, ఓటర్లకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి, ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు.



బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మోడల్ కోడ్ ఖచ్చితంగా అమలు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి, కళాశాలను కలెక్టర్ సందర్శించారు. బస్సుల కోసం పార్కింగ్, స్టాల్స్ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలని కోరారు. అనంతరం ఎస్‌కోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. బిఎల్‌ఒలతో మాట్లాడి అక్కడి వసతులపై ఆరా తీశారు. తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్, ఫర్నీచర్, నేమ్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, శృంగవరపుకోట నియోజకవర్గ ఆర్‌ఒ పి.మురళీకృష్ణతదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు టివి ఛానళ్లు స్థానిక కేబుల్ టివి నెట్‌వర్క్‌లు, ఆడియో విజువల్ ప్రచారం కోసం జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్, మోనిటరింగ్ కమిటీ నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటైన జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడియో విజువల్ ప్రకటనలతో పాటు, మొబైల్ ఫోన్లకు పంపించే బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ సందేశాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఎల్ఇడి స్క్రీన్లలో, వీడియో పబ్లిసిటీ వ్యాన్‌లలో ప్రదర్శించే ప్రచారచిత్రాలకు కూడా జిల్లా స్థాయి కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ప్రకటనలు ప్రసారం చేసేందుకు సమాచార పౌరసంబంధాలశాఖ ధరలు నిర్ణయించిందని తెలిపారు. అభ్యర్థులు లేదా పార్టీలు సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. దినపత్రికల్లో జారీచేసే ప్రకటనలకు కూడా ధరలను నిర్ణయించామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆయా పత్రికల్లో వచ్చే వార్తలను పరిశీలించి పెయిడ్ న్యూస్ గా నిర్ధారించినట్లయితే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. జెసి కె.కార్తీక్, ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత డిపిఆర్‌ఒ డి.రమేష్, కమిటీ సభ్యులు డాక్టర్ ఐ.తారకేశ్వర్,పిఎస్ఎస్‌వి ప్రసాదరావు, ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

యువత భవితను చిదిమేస్తున్న జగన్ మాఫియా

టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువత భవితన జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తోందని టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో నెంబరు 1 స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి గంజాయి, డ్రగ్ రవాణాలో ఒకటో స్థానానికి చేర్చారని విమర్శించారు. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి.. డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారన్నారు. విశాఖలో దొరికిన కంటైనర్‌లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫటేమిన్, మెస్కిలన్ వంటి భయంకర మత్తు పథార్థాలున్నాయని సిబిఐ తన నివేదికలో పేర్కొందన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఎపి లోనే దొరుకుతున్నాయన్నారు. జగన్ రెడ్డి దోపిడీని యువత ప్రశ్నించకుండా ఉండేందుకు వారిని మత్తులో దించి జాతిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

భగత్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా నవ యువ సమాఖ్య అధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. శనివారం స్థానిక వైఎస్ఆర్‌నగర్ లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని, ఆయన జీవిత చరిత్రను ఎన్ వై ఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు వివరించారు. భగత్ సింగ్ అసాయసాధనకు కషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు

స్వీప్ ర్యాలీలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతీఒక్కరూ ఓటు విలువను తెలుసుకొని, రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఓటు వేయడానికి వీలుగా విభిన్న ప్రతిభావంతులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మొసానిక్ లాడ్జ్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు శనివారం విభిన్న ప్రతిభావంతులు శనివారం నిర్వహించారు. మొసానిక్ టెంపుల్ వద్ద ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఓటు ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కును వినియోగిం చేందుకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. సదరం సర్టిఫికేట్ ప్రకారం 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారు, తాము ఇంటినుంచే ఓటు వేసుకొనే సదుపాయం ఉందన్నారు. అవసరమైన వారికి రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని, పోలింగ్ కేంద్రాలవద్ద వాలంటీర్లను, వీల్ ఛైర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సౌకర్యాలను వినియోగించుకొనేందుకు సక్షం యాప్ ద్వారా ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అంధులకోసం బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పత్రాన్ని కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక సైన్ లాంగ్వేజీల్లో బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎడి జగదీష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ఎమ్మెల్యే కడుబండికి చుక్కెదురు

గ్రామ సందర్శనకు అనుమతి లేదని నిలుపుదల

వెనుదిరిగిన నాయకులు

ప్రజాశక్తి-జామి

శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఎన్నికల ప్రచారంలో చుక్కెదురైంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుండగా గ్రామ సందర్శన కార్యక్రమాన్ని అనుమతి లేకుండా నిర్వహించడం తగదంటూ అధికారులు ఆ సమావేశాన్ని నిలుపుదల చేశారు. మండలంలోని రామయ్యపాలెంలో శనివారం గ్రామ సందర్శన కార్యక్రమానికి అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. యధావిధిగా ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని, సమావేశానికి సిద్ధమవుతున్న తరుణంలో గ్రామ కార్యదర్శి నజ్మా సమావేశానికి అనుమతులు తీసుకోలేదని, కాబట్టి సమావేశం నిర్వహించడం కుదరదని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే అక్కడ నుంచి వెనుదిరిగారు.

అయితే అధికారులు ఎన్నికల నియమావళిని గుర్తు చేయడంతో పాటు సమావేశానికి అడ్డుపడడం అధికార పార్టీ నాయకులకు మింగుడు పడలేదు. ఈ విషయంపై ఎంపిడిఒను వివరణ కోరగా, అనుమతి లేని కారణంగా సమావేశం నిలుపుదల చేయడం వాస్తవమేనని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమావేశాలు, సభలకు అనుమతి తప్పనిసరి అని గుర్తు చేశారు.

నేడు క్షయ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

క్షయ ఒక అంటు వ్యాధి అని, దాని నివారణకు ప్రణాళికా యుతంగా చర్యలు తీసుకుంటున్నామని టిబి నివారణ అధికారి కె.రాణి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్షయ నివారణ దినం సందర్భంగా ఆదివారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్షయ అనేది మైక్రో బ్యాక్టీరియం ట్యూబెర్క్యులసిస్ అనే బాక్టీరియా ద్వారా సోకుతుందన్నారు. ఈవ్యాధి గోర్లు, వెంట్రుకలకు తప్పించి శరీరంలో ఏ అవయవానికైనా వస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కఫం పరీక్షలో టిబి నిర్ధారణ జరిగితే 6 మాసాలు పాటు ఉచితంగా మందులను ఇస్తామని, వాటిని క్రమం తప్పకుండా వాడాలని సూచించారు.

టెన్త్ పరీక్షకు 826 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం

టెన్త్ పరీక్షల్లో భాగంగా శనివారం సైన్సు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 826 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 26,082 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 25,256 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 44 కేంద్రాలను స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేశారు.

రోడ్ల విస్తరణ పూర్తి చేస్తామని హామీ ఇవ్వగలరా?

ప్రజాశక్తి- బొబ్బిలి

రానున్న ఎన్నికల్లో గెలిస్తే రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చే దమ్ము ఉందా అని ప్రధాన పార్టీలను లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ప్రశ్నించారు. బజారు, పూల్‌బాగ్ రోడ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన మున్సిపాలిటీలో రోడ్లు అభివృద్ధి చెందడం లేదన్నారు. తాము గెలిస్తే పట్టణంలోని బజారు రోడ్డు, పూల్ బాగ్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లు విస్తరణ, నియోజకవర్గ అభివృద్ధిపై హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయనతో సమాచార హక్కు చట్టం సభ్యులు సురేష్ ఉన్నారు.

రఘురాజును వైసిపి నుంచి సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆయననున పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముద్దాడ మధు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పార్టీ నాయకులకు ఆయన వినతి పత్రం అందజేశారు. జిల్లాలో మూడు ఎమ్మెల్సీ పదవుల్లో క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. అయినా వ్యక్తిగత కారణాలు చూపి ఎస్.కోటలో ఉన్న బిసి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నడిపి తన భార్యను, సర్పంచులను, ఎంపిటిసిలను టిడిపిలో చేర్చి ఆయన ఇంకా వైసిపిలో ఉండి పదవులు అనుభవించడం సరికాదన్నారు. బిసి లను అణగదొక్కాలనే ఉద్దేశం తప్ప మరొకటి కాదన్నారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

ఎన్‌డిఎకు లోక్‌సత్తా మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్‌డిఎ కూటమికి లోక్‌సత్తా మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టిబాబ్జీ తెలిపారు. శనివారం ఆయన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజును కలిశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని రాజకీయ అరాచకం ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే కొనసాగుతుందని, అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తే రాష్ట్రంలో సామాన్య ప్రజలు బతకడం కష్టమని అన్నారు. తాను సుదీర్ఘ కాలం రాష్ట్రంలో, కేంద్రంలో మంత్రి గా పనిచేసినప్పటికి ఇంతటి రాజ్యాంగ దుర్వినియోగం ఎప్పుడూ ఎక్కడా చూడలేదని అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరంగంలోనూ సంతృప్తిలేని పరిపాలన అందించడంలో జగన్ విజయం సాధించారని అన్నారు. అశోక్‌ను కలిసి వారిలో లోక్‌సత్తా నాయకులు జలంత్రి రామ చంద్ర రాజు,పిడకల ప్రభాకరరావు, అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, పొలుపర్తి అప్పారావు, పతివాడ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


అందరినోటా ఎన్నికల మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గరపడ్డాయ్... నోటిఫికేషన్ వచ్చి కూడా దాదాపు వారం రోజులు గడించింది. వైసిపి గత శనివారమే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లోనూ తిరిగి సిట్టింగులకే అవకాశం కల్పించింది. ఇటు టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో విజయనగరం, అరకు ఎంపీస్థానాలు, చీపురుపల్లి అసెంబ్లీ, మన్యం జిల్లా పాలకొండ అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలిన చోట్ల అభ్యర్థులను ఖరారు చేశారు.

మరోవైపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. అభ్యర్థుల ఎన్నికల ప్రచాం హోరు కూడా ఇటీవలే జోరందుకుంది. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో వివిధ పార్టీల బలాబలాలతోపాటు అభ్యర్థుల సామర్థ్యం, సానుకూల అంశాలు, ప్రతికూల అంశాలపై పబ్లిక్ టాక్ ఊపందుకుంది. గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి స్థానిక సమస్యల పరిష్కారానికి, జిల్లాకి, రాష్ట్రానికి ఇచ్చిన హామీలతోపాటు అంతకు ముందు టిడిపి పాలనలో చేపట్టిన పనులు, పథకాలు, వైఫల్యాలను కూడా భేరీజువేస్తున్నారు. అభ్యర్థులు మాత్రం ఓవైపు ప్రచారంలో బిజీబిజీగా గడుపుతూనే ఓటర్లను ఆశలపల్లకిలో ముంచే పనిలో నిమగ్నమయ్యారు. అక్కడక్కడా లోబరుచుకునే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. ఎన్నికల ప్రచార సామగ్రి సమకూర్చుకునే పనిలో ముఖ్యంగా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తలమునకలయ్యాయి. దీంతో, ఫ్లెక్సీలు, బేనర్లు, పోస్టర్స్, కరపత్రాలు వేసే ప్రింటర్లు బిజిబిజీగా మారారు. ఈనేపథ్యంలో ఎన్నికల అధికారులు కూడా ప్రచారానికి పరిమితులు విధించారు. ఇంతకు ముందులా ముందస్తు అనుమతి తీసుకోకుండా అభ్యర్థులు నచ్చిన చోటులో ప్రచారం చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటు మీడియాలోని రాతలపైనా ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాల్లో ఎన్నికల మానటరింగ్ సెల్ ఏర్పాటుచేశారు. ఎన్నికల ఏర్పాట్లతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో స్పందించే విధంగా తగిన సిబ్బందిని నియమించారు. ఇక చెప్పడాలుండవ్... చర్యలే అంటూ ఇప్పటికే రెండు జిల్లాకు చెందిన ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) హెచ్చరికలు జారీచేసిన సంగతి తెలిసిందే. ఇక ప్రధాన పార్టీల విషయానికి వస్తే ముఖ్యంగా టీడీపిలో దాదాపు అన్ని చోట్లా అంతర్గత విభేదాలు ఎన్నికల సందర్భంగా మరోసారి రచ్చకెక్కాయి. సీట్లు రాక కొంతమంది అలకబూని, తమ కేడర్‌ను కొత్త అభ్యర్థుల వెంట వెళ్లకుండా అడ్డుపడుతున్నారు. భోగాపురంలో పొత్తులో భాగంగా జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించినప్పటికీ తెలుగు తమ్ముళ్లు సహకరించని పరిస్థితి దాపురించింది. ఎంపి టిక్కెట్ కూడా బిజెపికి కేటాయించ నుండడంతో తమ పార్టీ గుర్తు చూడడానికి కూడా అవకాశం లేకుండా పోయిందంటూ తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు వైసిపి ప్రమాదకరమైన గ్రూపులేమీ లేకపోయినప్పటికీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ స్థాయి నాయకులకు వివిధ భవనాలు, రోడ్ల నిర్మాణ పనులకు బిల్లులు రూ.కోట్ల పెండింగ్‌లో ఉండడం వల్ల వైసిపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది తమ ప్రభుత్వంలో అప్పుల ఊబిలో కూరుకుపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు కేంద్రం ఇవ్వకపోవడం, ఇచ్చిన అరకొర నిధులు తమ అధినేత ఇతర అవసరాలకు మళ్లించడంతో గ్రామాల్లో వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలు తీర్చలేకపోయామని, ఇటు సచావా లయాలు తమ పరిధిలో లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలు తమకు సంబంధం లేకుండానే మంజూరయ్యాయని, ఇటువంటి పరిస్థితుల్లో తమ మాట ఇప్పుడు ఎలా చెల్లుబాటు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు అయోమయ పరిస్థితుల నడుమ ఎన్నికలకు సిద్ధమౌతున్నాయి. దీంతో, గ్రామాల్లో సభలకు కూడా వేలాది రూపామలు ఖర్చు చేసుకోవాల్సిన దుస్థితి ఆయా పార్టీలకు ఏర్పడిందని జనం చర్చించుకుంటున్నారు.





వృద్ధురాలితో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

నీతివంతమైన పాలన అందించాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశకి-విజయనగరం టౌన్

నీతివంతమైన పాలన అందించిన వైసిపికి మరోసారి అవకాశం ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్, విజయనగరం వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. శనివారం దాసన్నపేట నవాబు పేట ప్రాంతం నుంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తమకు వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.మరొకసారి అవకాశం ఇచ్చినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్‌చార్జిలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, వైసిపి నాయకులు కేపీపీ రాజు, కోరాడ రాజు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలతో సిపిఎం నాయకులు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని సరిహద్దు గిరిజన గ్రామం కొర్లవానివలసకు చెందిన సుమారు 25 కుటుంబాలు గత 8 నెలలుగా తాగునీటికి అవస్థలు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. గిరిజన మహిళలు సుదూర ప్రాంతాల ఊట బావుల వద్దకు వెళ్లి కలుషిత నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో గ్రామంలో నిరసన తెలిపారు. మండలానికి సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి, స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, గురువిల్లి సర్పంచ్ బొంగు సింహాచలంలకు ఫోన్‌లో ఫిర్యాదు చేసామని ఆయన తెలిపారు. తక్షణమే సోలార్ పంపులైన్ మోటారు బాగుచేసి గిరిజనులకు తాగునీరు అందించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని రాములు హెచ్చరించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి 2024 -2025 సంవత్సరాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రింట్ అవుట్, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు పాఠశాలకు విధిగా అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తమ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గంట్యాడ: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మదనాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్ రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 -2025 సంవత్సరంలో ఇంటర్‌లో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను తీసుకుంటున్నామన్నారు. ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీషులో బోధన చేస్తున్నామని, ప్రభుత్వం, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 28వ తేదీ నుండి మే 22 వరకు దరఖాస్తుల చేసుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఒసి,బిసి,ఈడబ్ల్యూఎస్‌లకు 200 రూపాయలు, ఎస్‌సిఎస్‌టిలకు 150 రూపాయలు ఫీజు చెల్లించాలన్నారు. 10వ తరగతి మార్కులు మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలు కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, ఎంఇఒని సంప్రదించాలని కోరారు.



ఎఒకు వినతి పత్రాన్నిస్తున్న బండారు పెదబాబు, రైతులు

ధాన్యం డబ్బులు చెల్లించకుంటే ఆందోళన

ప్రజాశక్తి - జామి

మండలంలోని ధాన్యం రైతులకు ప్రభుత్వం కోట్లలో బకాయి పడిందని, కాయ కష్టం చేసి పండించిన పంటకు ఫలితం రాకుంటే రైతు ఏం తిని బతకాలని మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎఒ కిరణ్ కుమార్‌కి రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం నాటికి రైతుల ఖాతాల్లో డబ్బు జమ కానీ యెడల మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడాతమని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకూ రూ.8.40కోట్లు బకాయిలు చెల్లించాలన్నారు. ఇప్పటికే అనేక దపాలు జిల్లా ఉన్నతాధికారులకు వినతులు అందజేశామని కానీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వర్రీ రమణ, వేంద్రపు నాయుడుబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే తగిన గుణపాఠం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని తూర్పు కాపులకు సీట్లు కేటాయించడంలో అన్యాయం జరుగుతోందని, ఇదే కొనసాగితే రానున్న ఎన్నికలలో తూర్పు కాపుల సత్తా ఏమిటో చూపిస్తామని తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు హెచ్చరించారు. శనివారం తూర్పు కాపు సామాజిక వేదిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో సీట్లు కేటాయింపుల్లో తూర్పుకాపు యేతరులకు సీట్లు కేటాయించడం అన్యాయమన్నారు. జిల్లాలో 12.50 లక్షలు ఓట్లు కలిగిన కాపు కులానికి ప్రాధాన్యత ఇవ్వకుండా వేరే కులానికి సీట్లు ఇవ్వడమంటే కాపులను అవమానించడమే నన్నారు. పక్క జిల్లా వారికి ఇక్కడ సీట్లు ఇస్తే జిల్లా వారిని అవమనించినట్లేనన్ని, అదే జరిగితే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక నాయకులు ఎం.రమణమూర్తి, టి.వెంకటరమణ, ఎం.నాగభూషణరావు ,అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరంకోట



వివరాలను వెల్లడిస్తున్న సిఐ వెంకటరావు

విజయ నగరం రైల్వేస్టేషను రోడ్డులో శనివారం ఉదయం అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి రూ. 90 వేలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. తమకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ఎస్ఐ నవీన్ పడాల్ , టాస్క్ ఫోర్స్ ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బృందం రైల్వే స్టేషన్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో వస్తుండగా చేసిందన్నారు. వారి బ్యాగుల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించి విచారణ చేయగా, రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర సింగ్, బింజారాంగా తెలిపారన్నారు. తాము కూలి పనులు చేస్తుంటామని, గంజాయి అలవాటు ఉండడంతో తక్కువ మొత్తంలో తమ అవసరాలు తీర్చుకుంటూ, మరికొంత అమ్ముకోవాలని ఉద్దేశంతో సాలూరులో 18కిలోల గంజాయిని కిలో ఒక్కింటిని రూ.2వేలకు వీరు కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని డిప్యూటీ తాహశీల్దార్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. డబ్బులకు ఆశ పడి చాలామంది యువకులు ఈ తరహా నేరాలకు పాల్పడి, గంజాయి కేసుల్లో నిందితులుగా మారుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అర్ధ రాత్రులు తిరుగుతూ ఇంటికి వస్తే వారు చెడు మార్గం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సేవించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో నాతవలస టోల్ ప్లాజా వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 17 గోవులను పట్టుకొని శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట నుంచి బొలెరో వాహనంలో తుని తరలిస్తున్న ఆవులను జాతీయ రహదారి నాతవలస టోల్గేట్ వద్ద స్థానిక ఎస్ఐ కృష్ణమూర్తి వాహనాలను తనిఖీ చేయగా పట్టుకున్నారు. వాహనంలో 17 లేగదూడలు ఉన్నాయి. వాటిని స్టేషన్‌కి తరలించి బొలెరో వాహనాన్ని సీజ్ చేసి వాహన యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేశామని, ఆవులను రైతుల సంరక్షణలో ఉంచామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- మెంటాడ

ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారులు పక్కాగా అమలు చేయాలని ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. వాలంటీర్లు ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, వాలంటీర్లపై నిఘా ఉందని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యస్.దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ లక్ష్మీబాయి, ఇఒపిఆర్‌డి విమల కుమారి, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గంట్యాడ: ఓటు వేసే రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాల్సి బాధ్యత అందరిపై ఉందని గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ సూర్య కళ అన్నారు. మండలంలోని శనివారం రూట్ నెంబర్ 28లోని కొత్త వెలగాడ, మదనాపురం, తాటిపూడి, మధుపాడ పోలింగ్ స్టేషను తనిఖీ చేశారు. ఇప్పటి నుండి ప్రతి పోలింగ్ స్టేషను పరిశీలన చేయాలని సూచించారు. ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నేలకంఠేశ్వర రెడ్డి, ఎంఇఒ వెంకటరావు, సెక్టర్ 22 అధికారి సిడిపిఒ ఉమా భారతి, ఆర్ఐ హరిప్రియ, బూత్ లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎన్నికల నియమావళిపై అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎ. సాయిశ్రీ ఆదేశించారు. తన కార్యాలయంలో ఎన్నికలు నిర్వహణపై శనివారం నియోజకవర్గంలో ఉన్న మున్సిపల్, నాలుగు మండలాల అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఏ పార్టీ నాయకులైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారం, సభలు, ర్యాలీలను పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



బొబ్బిలి : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

బిఎల్ఒలతో సమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండలంలోని బిఎల్ఒలకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు ఎన్నికల కోడ్‌పై శనివారం అధికారులు వివరించారు.

సచివాలయాల పరిధిలో నిర్వహించే ర్యాలీలకు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రామాలలో ఓటర్లను ప్రలోభాలు పెట్టే వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఎన్నికలు పూర్తయినంత వరకూ గ్రామ సచివాలయ సిబ్బందికి, గ్రామ రెవెన్యూ అధికారులకు సెలవులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- వేపాడ

కెజెపూడి గిరిజన రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజనులకు ఇచ్చిన డి పట్టా భూముల్లో కంపెనీలు పేరుతో కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ మేరకు శనివారం గిరిజన రైతులతో కలిసి ఆయన ఆ గ్రామం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ ఐటిడిఎ హైస్కూల్ నుంచి కోటయ్య గురువు వరకూ తారు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములు ప్రస్తుతం ఎకరా రూ.50లక్షల వరకూ పలుకుతుందని అయితే తెలివిగా బోత్ర అనే కంపెనీ గిరిజనులకు ఎకరాకు రెండు, మూడు లక్షలు ఇచ్చి తెల్ల కాగితంపై రాయించుకుని సుమారు 200 ఎకరాలు సమీకరించిందన్నారు. ఈ సమీకరణకు బొద్దాం కేంద్రంగా ఒక ఆఫీసు కూడా ఉందన్నారు. సమీకరించిన భూమిని బోత్ర వేరే యజమానులకు అధిక మొత్తానికి ఆ తెల్ల



నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

కాగితాలను అమ్మేసుకుందని ఆరోపించారు. ఈ భూములు కొనుగోలు చేసిన వేరే కంపెనీ గిరిజనులకు కొంత, బ్రోకర్లకు కొంత, రెవెన్యూ సిబ్బందికి కొంత మూడు విభాగాలుగా నిర్ణయించుకొని విఆర్ఒ నుంచి సిసిఎల్ఎ వరకూ మొత్తం వ్యవహారం నడిపిందన్నారు. వారు కొనుగోలు చేసిన భూములకు పక్కనున్న భూములు గిరిజనులు ఇవ్వకపోతే బెదిరిస్తున్నారన్నారు. వాళ్లకి అమ్మిన భూములు మాత్రమే భూ బదలాయింపు చట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు రెగ్యులరైజ్ చేస్తున్నారని, గిరిజనులు అమ్మని భూములను రెగ్యులర్ చేయకుండా పిఒటి కింద ఉంచేస్తున్నారని అన్నారు. భూ బదలాయింపు చట్టం ప్రకారం చట్ట సవరణ నాటికి అమ్మకం జరిగిన భూములను పిఒటిలో పెట్టి సాగు చేస్తున్న రైతులకు రెగ్యులరైజ్ చేయాలన్నారు. కానీ వేపాడ రెవెన్యూ సిబ్బంది దీనికి భిన్నంగా చేస్తున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి సాగు చేస్తున్న భూములకు రెగ్యులర్ చేయాలని, కంపెనీలు కొనుగోలు చేసిన భూములను పిఒటిలో పెట్టి ఆ భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాగా చాలా ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజన రైలులకు సర్వే చేసి వారికి పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతు సంఘం జిల్లా నాయకులు సుకురు గంగులు, చేపల నాగరాజులతో పాటు కెజెపూడి యువకులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణం

ప్రజాశక్తి- విజయనగరం కోట

మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు షిణగం శివాజీ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ సూచనల మేరకు జనవిజ్ఞాన వేదిక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 38వ డివిజన్ పరిధిలో గల ఉడా ఫేస్-3 వాకర్స్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత జరగాలంటే మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని ఏడాది కాలం పాటు సంరక్షిస్తే అవి జీవితకాలం మనల్ని సంరక్షిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్, విశ్రాంత ఎస్ఐలు మోహన్ దత్త, ఆనందరావు, పార్క్ నిర్వాహకులు అచ్యుతరావు, శామ్యూల్ పాల్గొన్నారు.

ఉద్యోగులను సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎటువంటి నోటీసులూ లేకుండా మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులను సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం కాదా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ప్రశ్నించారు. శనివారం స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరశన సమ్మె 52వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా నిరశన శిబిరంలో సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఉద్యోగులను సస్పెండ్ చేయడం, డిఎలు ఎగ్గొట్టడం చట్ట విరుద్ధం కాదా? దీనిని జెసిఎల్ సమర్థిస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యంగా జెసిఎల్ ఉన్నది కార్మికుల కోసమా మిమ్స్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరించడం కోసమా అని ఆగ్రహించారు. యాజమాన్యం ఉద్యోగుల పైన వేధింపులు సస్పెండ్‌లు ఆపాలని, బకాయిలు ఉన్న 7డిఎలను ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే యాజమాన్యం సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా ఈ సమస్యలను పరిష్కారం చేయాల్సిన లేబర్ అధికారులు ఒకవైపు కార్మికులతో ఉద్యోగులతో కార్మిక సంఘ నాయకులతో చర్చిస్తూనే యాజమాన్యం వైపు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. లేబర్ అధికారులు కార్మికుల పక్షాన ఉంటారా? తప్పు చేస్తున్న యాజమాన్య పక్షాన నిలుస్తారా తేల్చుకోవాలని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అప్పలనాయుడు, కామునాయుడు అనే ఇద్దరు ఉద్యోగులను ఎందుకు సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. లేబర్ అధికారులు దీన్ని సమర్థిస్తారా? అని అడిగారు. వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలని సురేష్, యూనియన్ అధ్యక్షులు టివి రమణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎం. నారాయణరావు, అప్పలనాయుడు, కామునాయుడు, నాగభూషణరావు, రామకృష్ణ, రాంబాబు, మధు, గౌరీ, భవాని, ఆదినారాయణ, మూర్తి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్

దంత పరిరక్షణకు అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం నెల్లిమర్ల కమ్యూనిటీ హెల్త్ వైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొంత మంది పిల్లలకు దంత పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలో కానీ, పెద్దల్లో కానీ ఎటువంటి దంత సమస్యలున్నా నెల్లిమర్ల సిహెచ్‌సిలో సంప్రదించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. చాక్లెట్లు తినరాదని, పీచు పదార్థాలను తినాలని, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆమోదించిన సాఫ్ట్ బ్రష్‌లను, పేస్టులను వాడాలని, రెండు నిమిషాలు కన్నా ఎక్కువ సేపు బ్రష్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వివిఎ నరసింగరావు, పాఠశాల కమిటీ చైర్మన్ బాలి శ్రీరామునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దంత పరీక్ష చేస్తున్న వైద్యుడు మల్లికార్జునరావు

పుట్టుకతో వచ్చే వ్యాధుల్లో వర్ణ అంధత్వం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పుట్టుకతో వచ్చే వ్యాధులలో వర్ణ అంధత్వం (కలర్ బ్లైండ్ నెస్) ఒకటని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ శివరామ్ మాలే అన్నారు. నేడు మహిళల్లో కంటే పురుషుల్లో ఈ వ్యాధి అధికంగా ఉంటుందన్నారు. ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఇంపార్టెన్స్ ఆఫ్ కలర్ విజన్ ఇన్ రెటీనల్ డిసీజెస్ అనే అంశంపై శనివారం అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 0.5 శాతం మంది మహిళలు, 8.3 శాతం మంది పురుషులు వర్ణ అంధత్వంతో బాధ పడుతున్నారని తెలిపారు. డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు మాట్లాడుతూ ఇక్కడ ఆప్టోమెట్రీ చదివిన విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారన్నారు. ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో పారిశ్రామిక వేత్తలు, వ్యవస్థాపకులుగా ఎదగడానికి ఈ కోర్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతమ్మ, విభాగాధిపతి శ్రావణి, ఆలన, దినేష్ కుమార్, సౌరజిత్ బెనర్జీ, పడాల ఈశ్వర్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరామ్

కృత్రిమ మేధాతో ఉపాధి అవకాశాలు మెండు

కృత్రిమ మేధాతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్ కొణతాల తిరుమలేష్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధా-ఉపాధి అవకాశాలు అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వస్తొన్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త కొత్త అంశాలు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో బిగ్ డేటా, డేటా అనాలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అంశాలు ఉండగా నేడు వాటి స్థానంలో జెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజీ మోడల్స్, చాట్ జిపిటి, రిట్రివల్ ఆగ్యుమెంటెడ్ జనరేషన్ వంటి అంశాలు వచ్చాయన్నారు. వీటిపై కూడా అవగాహన పెంచుకున్న వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ఎంపికలో తాత్సారం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని టిడిపి కార్యకర్తలు నిరుత్సాహానికి గురువుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిని అధిష్టానం మూడవ జాబితలోనూ ప్రకటించకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నిరుత్సాహనికి గురవుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను ప్రకటించడంతో వారు గ్రామాలలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. దీంతో టిడిపి కార్యకర్తలు అభ్యర్థి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంపై అధిష్టానం ఏ విధమైన ఆలోచనతో ఉందోనని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ నియోజకవర్గం పై అధికార పార్టీ నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చెంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ప్రభావం ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. అధికార పార్టీ నాయకులను, గ్రామాలలో ఉన్న వారి అనుచరులను ఎదుర్కోవటం తెలుగు తమ్ముళ్లు కు సవాలుగా ఉంది. అయితే టిడిపి విజయానికి కృషి చేస్తున్న కార్యకర్తలతో మరింత ఉత్సాహన్నీ నింపేందుకు అభ్యర్థి ఎంపిక పూర్తి చేసి ఉత్కంఠకు తెరదించాలని కార్యకర్తలు

కార్యకర్తల్లో నిరుత్సాహం

కోరుతున్నారు. అభ్యర్థి ఎంపిక పై పార్టీ సర్వేలో భాగంగా మొదటిలో కిమిడి నాగార్జున లేదా నోటా అని, రెండోవ సారి గంట శ్రీనివాసరావు అని, మూడవసారి కిమిడి కళా వెంకటరావు అని అభిప్రాయ సేకరణ చేసినా ఏ ఒక్కరికీ టికెట్టు ప్రకటించకపోవడం ఏంటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. 2019 ఎన్నికలలో టిడిపి తరుపున పోటీ చేసి ఓటమిపాలైన కిమిడి నాగార్జున చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గా, విజయనగరం పార్లమెంటు అధ్యక్షులుగా భాద్యతలు నిర్వహించారు. చీపురుపల్లి అసంబ్లీ అభ్యర్థిగా కిమిడి నాగార్జున ను అధిష్టానం ప్రకటిస్తుందని ఊహాగానాలు ఊపందుకున్నాయి. మొదటి జాబితాలో ప్రకటించి లేదు. తరువాత ప్రకటిస్తారని అనుకున్నారు. అప్పుడు కూడా ప్రకటించకపోగా అనూహ్యంగా గంటా శ్రీనివాసరావు పేరు తెరపైకి రావడంతో చీపురుపల్లి టికెట్ పై సందిగ్ధత నెలకొంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు అభ్యర్థి ప్రకటనపై అధిష్టానం పై ఒత్తిడి తేకపోవడం కూడా ఆలస్యానికి ఒక కారణంగా చెబుతున్నారు.

ప్రాణాలర్పించిన త్యాగధనులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌లను ఆదర్శంగా తీసుకోని ఉద్యమించాలని వామపక్ష నేతలు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పలసూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమర కార్మికుల భవనంలో సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి వేడుకలు సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గ పాలనపై వీరి ముగ్గురునీ ఆదర్శంగా తీసుకోని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వామపక్ష నేతలు పాల్గొన్నారు.

బొబ్బిలి: దేశం కోసం చిన్నతనంలోనే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ప్రాణ త్యాగం చేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు డి.వర్మ అన్నారు. పట్టణంలోని గంటి ప్రసాదం భవనంలో ఎఐవైఎఫ్, ఎన్‌జిఒ హోమ్‌లో పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విప్లవ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నెల్లిమర్ల: నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, పిడిఎస్ఒ నాయకులు రాకేష్, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ ప్రాథమిక పాఠశాలలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి శనివారం ఉపాధ్యాయులు జి. నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర కోసం పోరాడి చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడి వీరమరణం పొందిన గొప్ప యోధులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజాంలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- రాజాం

రాజాం మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ పాఠశాలలో మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎం. బాబు అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గర్భస్త శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టం అనే అంశాలపై ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులు, విధులను కల్పించిందని, వాటికి భంగం కలిగితే ఎవరైనా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. స్త్రీలను ప్రతి ఒక్కరూ గౌరివించాల్సి ఉందని పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ నేరమని చెప్పారు. నర్స్ వృత్తి కఠినతరమైందని, బాధ్యత, ఓర్పుతో కూడుకున్నదని నర్స్ కోర్టు ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థినులను అభినందించారు. ఈ సదస్సులో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయి తేజ, సీనియర్ న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, నర్సింగ్ స్కూల్ ఎఒ జి. తిరుపతిరావు, రాజాం టైన్ పోలీసు సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. బాబు